# పేద పిల్లల కల్పవృక్షం

## వృషమణి ఫౌండేషన్



**మధురానగర్‌లోని వృషమణి ఫౌండేషన్‌లో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులు**

**న్యూస్‌టుడే-యూసుఫ్‌గూడ**

అప్పుడు ఆ కుర్రాడి వయసు కేవలం పదకొండేళ్లు. ఓ రోజు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ గుండా బడికెళ్తున్నాడు. స్టేషన్లో చిరిగిన దుస్తులతో బక్క చిక్కిన వీధి బాలల్ని చూశాడు. వారు కంటపడగానే ఆ కుర్రాడి మనసు చలించింది. వారి దైన్యత ఆ చిన్నారి మనసులో ఎన్నో ఆలోచనలు రేపింది... పేదరికం కారణంగా చదుకోలేక ఇలా వీధిపాలవుతున్న పిల్లలకు, తాను పెద్దయ్యాక ఏదోలా సాయం చేయాలనుకున్నాడు. అప్పట్లో తోచిన ఆలోచనకు ఇప్పుడు బీజం వేశాడు. అలా పుట్టుకొచ్చిందే మధురానగర్‌లో వెలసిన వృషమణి ఫౌండేషన్. దీని ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు కార్పొరేట్ చదువులకయ్యే ఖర్చును సొంతం భరిస్తున్నాడు. సొంతంగా ఇంటి వద్దనే వీరికి వసతి కూడా కల్పించాడు. ఇంతటి ఔదార్యం చూపిస్తూ, ప్రచారానికి ఏమాత్రం ఆసక్తి చూపని ఆ వ్యక్తే సరస్ ఇండియా సాఫ్ట్‌వేర్ సంస్థ యజమాని యర్నేని చక్రధర్.

చక్రధర్ స్వస్థలం కృష్ణా జిల్లా అంగులూరు. తండ్రి జగన్మోహన్‌రావు ప్రభుత్వ రంగ సంస్థలో ఇంజినీరు. తల్లి విజయలక్ష్మి గృహిణి. నగరంలోని మధురానగర్‌లో ఉంటున్న చక్రధర్ మెకానికల్ ఇంజినీరింగ్ అయ్యాక అమెరికాలో ఎం.ఎస్. చేశారు. ఆర్థికంగా బాగా నిలదొక్కుకోవడంతో అక్కడే ఓ సాఫ్ట్‌వేర్ సంస్థను నెలకొల్పారు. తనవంతుగా కొందరు పేద విద్యార్థుల ఉన్నత విద్యకు సహకరిస్తే భవిష్యత్‌లో వారు తమ కాళ్లపై నిలబడడానికి వీలుంటుందని భావించారు. వెంటనే వృషమణి ఫౌండేషన్‌ను మధురానగర్‌లో గత ఏడాది ఏర్పాటు చేశారు. ఆర్థికంగా వెనుకబడి చదువుపై ఆసక్తి ఉన్నవారిని ప్రతిభ ఆధారంగా ఎంపికచేసి చదివిస్తున్నారు. గత ఏడాది ఏడుగురు, ఈ ఏడాది 13 మందిని ఇలా ఎంచి నగరంలో పేరున్న కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ చదివిస్తున్నారు. దీంతో పాటు ఐ.ఐ.టి., ఎ.ఐ.ఇ.ఇ.ఇ., తదితర పరీక్షలకు వారిని సన్నద్ధం చేస్తున్నారు. వచ్చే ఏడాది ఈ విద్యార్థుల సంఖ్యను మరింత పెంచనున్నట్లు ఆయన తెలిపారు.

మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన చందు పదో తరగతిలో 557 మార్కులు సాధించాడు. తండ్రి వాచ్‌మెన్. ఇల్లు గడవడమే కష్టం. ఇంతలో స్కూలు ప్రధాన ఉపాధ్యాయుని ద్వారా ఫౌండేషన్ గురించి తెలుసుకున్నాడు. వారు పెట్టిన పరీక్షల్లో ప్రతిభ కనబరిచాడు. పై చదువులు చదవాలన్న కోరిక ఇలా నెరవేరింది.





ప్రకాశం జిల్లాకు చెందిన ప్రసాద్ పదో తరగతి పరీక్షల్లో 515 మార్కులు సాధించాడు. ఇంటర్ చదివే స్థోమత లేదు. తండ్రి చేనేత కార్మికుడు. ఫౌండేషన్ ద్వారా వచ్చిన అవకాశం ఇంటర్‌లో చేర్పించింది. సంస్థ తోడ్పాటు లేకపోతే చదువు సాగేది కాదు. తానూ భవిష్యత్‌లో ఇతరులకు చేయూత అందిస్తాను అంటున్నాడు.

శ్రీకాకుళంకు చెందిన కూర్మారావు ఎస్ఎం పురంలోని రెసిడెన్షియల్ స్కూల్లో చదివాడు. పదో తరగతిలో 560 మార్కులు సాధించాడు. తండ్రి మెకానిక్. పై చదువులకు పంపలేని పరిస్థితి. అదే సమయంలో స్కూల్ ద్వారా ఫౌండేషన్‌కు ఎంపికైన కూర్మారావు అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు.





బాలాజీది కడప. ముక్కవారపల్లి రెసిడెన్షియల్ స్కూలు విద్యార్థి. పదో తరగతిలో 548 మార్కులు వచ్చాయి. తండ్రి మృతి చెందడంతో తల్లే అంతా అయ్యింది. చదువులో ప్రతిభ కనబర్చినా ఆర్థిక స్థోమత అడ్డుగా నిలిచింది. ఫౌండేషన్ అండ లభించటంతో ఇపుడు తానూ చదువులో ముందుకు దూసుకెళ్లగలననే విశ్వాసం ఈ కుర్రాడిలో స్పష్టమవుతోంది.

**ఎంపికకు ప్రతిభే ఆధారం : చక్రధర్, ఫౌండేషన్ నిర్వాహకులు**

ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నాం. పదో తరగతిలో ఎక్కువ మార్కులు సాధించిన పేద విద్యార్థులను ఎంపికచేసి వారికి వివిధ అంశాల్లో పరీక్షలు నిర్వహిస్తాం. ఉత్తమ ఫలితాలు సాధించిన వారిని నగరంలోని కార్పొరేట్ కళాశాలల్లో చదివిస్తున్నా. ఇందుకయ్యే ప్రతి పైసా ఫౌండేషనే భరిస్తుంది. వారు ఉండటానికి కావాల్సిన వసతి సౌకర్యాన్ని కల్పిస్తాం. ఈ పిల్లలు ఎంత వరకూ చదవాలనుకున్నా మా ఆసరా కొనసాగిస్తాం.